## హోరాహోరీగా మాన్‌సూన్ రెగెట్టా టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుసేన్‌సాగర్ వేదికగా జాతీయ రెగెట్టా చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ హైదరాబాద్ నిర్వహిస్తున్న మాన్‌సూన్ రెగెట్టా టోర్నీలో సెయిలర్లు పోటాపోటీగా తలపడుతున్నారు. పోటీలకు రెండో రోజైన మంగళవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో తెలంగాణ, తమిళనాడు సెయిలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. బాలికల సబ్‌జూనియర్ విభాగంలో శ్రేయకృష్ణ(తమిళనాడు), తెలంగాణ యువ సెయిలర్ లాహిరి కొమురవెల్లి వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బాలుర సబ్‌జూనియర్ విభాగంలో తమిళనాడు సెయిలర్ కృష్ణవీఆర్, స్థానిక సెయిలర్ మహమ్మద్ రిజ్వాన్ మధ్య తీవ్ర పోటీనెలకొనగా, కృష్ణకు అగ్రస్థానం దక్కింది. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్‌లో తనూజ-శ్రవణ్ జోడీ టాప్‌లో ఉండగా, దీక్షిత-గణేశ్ ద్వయం రెండో స్థానంలో ఉంది. మరోవైపు బిగినర్స్ లైట్ ఫ్లీట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో సాంఘిక సంక్షేమ స్కూల్‌కు చెందిన ఆరేపల్లి గ్రేస్‌తో పాటు కొండ సామాన్య విజేతలుగా నిలిచారు. 15 రేసుల్లో 10 గెలిచిన గ్రేసీ ఓవరాల్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది.



## ప్రియాంకకు స్వర్ణం

న్యూఢిల్లీ: ఆస్ట్రియన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ ప్రియాంక గోస్వామి పసిడి పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 10కి.మీల రేస్ వాక్‌ను ప్రియాంక 47నిమిషాల 54సెకన్ల వ్యవధిలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. తద్వారా ఈసీజన్‌లో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సరిగ్గా మూడేండ్ల క్రితం 10కి.మీల నడక రేసులో ప్రియాంక 45నిమిషాల 47సెకన్లతో తన అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేసింది. గోస్వామి 10కి.మీలతో పాటు 20కి.మీల రేస్ వాక్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

## భారత్‌కు భంగపాటు

ఏఎఫ్‌సీ ఏషియన్‌కప్



హాంకాంగ్: ప్రతిష్ఠాత్మక 2027 ఏఎఫ్‌సీ ఏషియన్‌కప్ టోర్నీకి అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో భారత్‌కు భంగపాటు ఎదురైంది. మంగళవారం హాంకాంగ్‌తో జరిగిన క్వాలిఫయర్ మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో ఓటమిపాలైంది. మ్యాచ్ మరికొద్ది నిమిషాల్లో ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీని హాంకాంగ్ చక్కగా సద్వినియోగం చేసుకుంది. మ్యాచ్ అదనపు సమయం(90+1)లో భారత గోల్‌కీపర్ విశాల్ కైత్ చేసిన తప్పిదంతో వచ్చిన పెనాల్టీని పెరీరా గోల్ చేయడంతో హాంకాంగ్ విజయం ఖరారైంది. చివరి వరకు రెండు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరుగగా, చివరి నిమిషంలో చేసిన తప్పుతో టీమ్‌ఇండియా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ ఓటమితో గ్రూపు-సీలో భారత్ ఒక పాయింట్‌తో రెండో స్థానంలో ఉండగా, హాంకాంగ్(4) అగ్రస్థానంలో ఉంది.

## పూరన్ వీడ్కోలు

అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ పలికిన విండీస్ హిట్టర్



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ఈ ఏడాది స్టార్ క్రికెటర్ల రిటైర్మెంట్ల పరంపరను కొనసాగిస్తూ మరో ఆటగాడు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆధునిక క్రికెట్‌లో బంతిని బలంగా బాదగల సమర్థుడు, టీ20 క్రికెట్‌లో సంచలన బ్యాటింగ్‌తో దుమ్మురేపుతున్న వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు రిటైర్మెంట్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. అతడి వయసు 29 ఏండ్లు మాత్రమే కావడం గమనార్హం. 2016లో కరేబియన్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఈ హార్డ్ హిట్టర్.. ఇప్పటిదాకా 106 టీ20లు, 61 వన్డేలు ఆడాడు. వెస్టిండీస్ తరఫున టీ20లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో పూరన్ (2,275 రన్స్) అగ్రస్థానంలో ఉన్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో అతడు.. 39.66 సగటుతో 1,983 రన్స్ సాధించాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న వెస్టిండీస్ టీ20 జట్టులో పూరన్‌కు చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలోనే పూరన్.. ఇంటర్నేషనల్ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికినట్టు వార్తలు వస్తున్నాయి. రిటైర్మెంట్‌పై పూరన్ స్పందిస్తూ.. 'సుదీర్ఘ ఆలోచనల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. ఈ ఆట నాకు చాలా ఇచ్చింది. మెరూన్ రంగు జెర్సీ ధరించడం, జాతీయ గీతం కోసం నిలబడటం నాకు ఎంతో ప్రత్యేకం' అని రాసుకొచ్చాడు. పూరన్ చివరిసారిగా 2024 డిసెంబర్‌లో వెస్టిండీస్ తరఫున టీ20 మ్యాచ్ ఆడాడు. 2022లో విండీస్ పరిమిత ఓవర్ల జట్టుకు సారథిగా నియమితుడైన పూరన్.. ఆ ఏడాది టీ20 వరల్డ్ కప్ పరాభవం తర్వాత ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. జాతీయ జట్టు నుంచి వైదొలిగినా ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతడు కొనసాగనున్నాడు. ఐపీఎల్‌లో పూరన్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న విషయం విదితమే. ఇటీవలే ముగిసిన 18వ సీజన్‌లో అతడు.. ఏకంగా 196 సగటుతో 524 రన్స్ చేశాడు.

# గద ఎవరిదో?

టైటిల్ నిలబెట్టుకోవాలని ఆసీస్ తహతహ

తొలి ట్రోఫీ కోసం దక్షిణాఫ్రికా ఆరాటం

రసవత్తర పోరుకు లార్డ్స్ సిద్ధం

**రెండున్నర నెలల పాటు పొట్టి క్రికెట్‌లో మునిగితేలిన అభిమానులకు ఆటలో అసలైన మజాను పంచే టెస్టు క్రికెట్‌తో అలరించేందుకు మరో మెగా ఈవెంట్ సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ 2023-25 సైకిల్‌కు శుభం కార్డు వేసేందుకు గాను అగ్రశ్రేణి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిద్ధమయ్యాయి. క్రికెట్ పుట్టినిల్లు ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఈ ఇరుజట్లు బుధవారం నుంచి 'గద' కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సైకిల్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ముఖాముఖి తలపడనుండటం ఇదే ప్రథమం. ఇప్పటికే రెండంకెల (10) ఐసీసీ ట్రోఫీలను తన ఖాతాలో వేసుకున్న కంగారూలు ఫైనల్‌లో డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగనుండగా ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చుకునే దిశలో సఫారీలు మరో కీలక పోరుకు సిద్ధమయ్యారు.**




లండన్: రెండేండ్లకోసారి ఐసీసీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 సైకిల్‌కు శుభం కార్డు పడే వేళైంది. రెండేండ్లపాటు 9 జట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఈ సైకిల్‌లో 69.44 శాతంతో అగ్రస్థానం దక్కించుకున్న దక్షిణాఫ్రికా.. 19 టెస్టులాడి 13 విజయాలు, 67.54 శాతంతో రెండో స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియా.. గద కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. గత రెండు ఎడిషన్ల మాదిరిగానే ఇంగ్లండ్ మూడోసారి ఆతిథ్యమిస్తున్న ఫైనల్‌కు ఈసారి టైటిల్ పోరు క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో జరుగనుంది. బుధవారం నుంచి మొదలుకాబోయే ఫైనల్ సమరంలో ఆసీస్ డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగనుండగా.. తమపై ఉన్న 'చోకర్స్' ముద్రను చెరిపేసుకోవడంతో పాటు ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చుకునేందుకు సఫారీలకు ఇదే సువర్ణావకాశం. ఇరు జట్లలో దుర్భేధ్యమైన బ్యాటింగ్ లైనప్, ఎంతటి బ్యాటర్‌ను అయినా బెంబేలెత్తించే పేసర్లు, మెరికల్లాంటి ఫీల్డర్లు ఉండటంతో మ్యాచ్ ఆసాంతం రసవత్తరంగా సాగనుండటం ఖాయంగా కనిపిస్తున్నది. మరి ఐసీసీ టోర్నీలంటేనే వందకు రెండు వందల శాతం ప్రదర్శనతో రెచ్చిపోయే కంగారూలు గదను రెండోసారి నిలబెట్టుకుంటారా? లేక సఫారీల దశాబ్దాల కల నెరవేరుతుందా? అనేది ఆసక్తికరం.

### ఖవాజాకు తోడుగా లబూషేన్!

2023లో 'ది ఓవల్' వేదికగా భారత్‌తో జరిగిన ఫైనల్‌లో ఆడిన జట్టులో రెండే రెండు మార్పులతో ఆస్ట్రేలియా బరిలోకి దిగనుంది. ఆ జట్టులో ఓపెనర్‌గా వచ్చిన డేవిడ్ వార్నర్.. ఇప్పుడు రిటైర్ అవగా ఆ స్థానంలో గడిచిన రెండేండ్లుగా ఎవరూ కుదురుకోవడం లేదు. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాకు తోడుగా స్మిత్, లబూషేన్‌తో పాటు ట్రావిస్ హెడ్‌నూ పలు మ్యాచ్‌లలో బరిలోకి దింపినా ఆ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. భారత్‌తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 19 ఏండ్ల సామ్ కొన్‌స్టాస్ రూపంలో ఆసీస్‌కు ఓ ప్రత్యామ్నాయం కనబడినా డబ్ల్యూటీసీ ఫైనల్‌లో మాత్రం ఖవాజాతో పాటు లబూషేన్ ఆసీస్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నారు. ఇక స్మిత్, హెడ్, క్యారీతో పాటు ఇటీవలే గాయం నుంచి కోలుకుని జట్టులోకి పునరాగమనం చేసిన కామెరూన్ గ్రీన్ వంటి బ్యాటర్లతో ఆసీస్ బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. మిచెల్ స్టార్క్, గత డబ్ల్యూటీసీ ఫైనల్‌కు గాయంతో దూరమైన జోష్ హాజిల్‌వుడ్, సారథి పాట్ కమిన్స్ పేస్ బాధ్యతలను మోయనుండగా నాథన్ లియన్ వంటి అనుభవజ్ఞుడైన స్పిన్నర్ ఆసీస్ సొంతం..

### రబాడాను ఆపతరమా?

ఆసీస్ ఇన్నింగ్స్‌ను ఎవరు ఆరంభించినా దక్షిణాఫ్రికా తురుపు ముక్క రబాడా పేస్ దాడిని ఎదుర్కోక తప్పదు. టెస్టులలో అంచనాలకు మించి రాణించే అతడు.. సఫారీ బౌలింగ్ యూనిట్‌కు కీలకం కానున్నాడు. ఖవాజా, రబాడా 10 టెస్టులలో ముఖాముఖి తలపడగా.. సఫారీ పేసర్ అతడిని 5 సార్లు ఔట్ చేశాడు. రబాడాకు అండగా మార్కో యాన్సెన్ పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు. మూడో పేసర్‌గా ఆ జట్టు లుంగి ఎంగిడిని ఎంచుకుంది. దీంతో ఆసీస్ బ్యాటింగ్ దళానికి, సఫారీ బౌలింగ్ బలగానికి ఆసక్తికర పోరు ఖాయంగా కనిపిస్తున్నది. ఇక ఆసీస్ పేస్ దళాన్ని ఎదుర్కొనేందుకు గాను సౌతాఫ్రికా.. మార్క్‌రమ్, రికెల్టన్‌ను ఓపెనర్లుగా బరిలోకి దించుతున్నది. మూడో స్థానంలో మల్డర్, నాలుగో స్థానంలో కెప్టెన్ బవుమా ఆడనున్నారు. ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బెడింగ్‌హమ్ వంటి బ్యాటర్లతో సఫారీలూ బలంగానే ఉన్నారు. ఈ సైకిల్‌లో దక్షిణాఫ్రికా తరఫున బెడింగ్‌హమ్ లీడింగ్ రన్ స్కోరర్‌గా ఉన్నాడు. స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్.. ఆస్ట్రేలియా బ్యాటర్లను ఏ మేరకు కట్టడి చేస్తాడో చూడాలి.

**మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో స్టార్‌లో లైవ్**

**తుది జట్లు:**
**దక్షిణాఫ్రికా:** మార్క్‌రమ్, రికెల్టన్, మల్డర్, బవుమా (కెప్టెన్), స్టబ్స్, బెడింగ్‌హమ్, వెరెయెన్నె (వికెట్ కీపర్), యాన్సెన్, కేశవ్, రబాడా, ఎంగిడి **ఆస్ట్రేలియా:** ఖవాజా, లబూషేన్, గ్రీన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, క్యారీ (వికెట్ కీపర్), కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియాన్, హాజిల్‌వుడ్

## ఎలావెనిల్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్



మ్యూనిచ్: జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ బోణీ కొట్టింది. పోటీల తొలిరోజైన మంగళవారం భారత యువ షూటర్ ఎలావెనిల్ వాలరివన్ కాంస్య పతకంతో మెరిసింది. మహిళల 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ విభాగం ఫైనల్లో ఎలావెనిల్ 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం ఒడిసిపట్టుకుంది. ఇదే కేటగిరీలో జిఫీ వాంగ్ (252.7, చైనా), ఎన్జీ క్వోన్ (252.6, కొరియా) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అంతకు ముందు జరిగిన క్వాలిఫయింగ్ పోరులో ఎలావెనిల్ 635.9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 2023లో నాన్సి (634.7)పేరిట ఉన్న జాతీయ రికార్డును తాజాగా ఎలావెనిల్ అధిగమించింది. మరోవైపు మహిళల 25మీటర్ల పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ (294)నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే కేటగిరీలో పోటీపడ్డ దివ్య (11), మనుభాకర్ (15), సిమ్రన్‌ప్రీత్‌కౌర్(24), రాహి సర్నోబత్ (47) తీవ్రంగా నిరాశపరిచారు.

## కృష్ణా ట్రిబ్యునల్ అవార్డుపై 18న అత్యవసర సమావేశం

**రాష్ట్రాలకు సమాచారమిచ్చిన కేంద్ర జల్‌శక్తి శాఖ**

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): కృష్ణా జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ) 2013లో ప్రకటించిన అవార్డును అమల్లోకి తీసుకొచ్చే అంశంపై కేంద్ర జల్‌శక్తి శాఖ ఈ నెల 18న అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నది. ఈ మేరకు బేసిన్‌లోని రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రకు సమాచారం అందించింది. కృష్ణా జలాల పంపిణీ కోసం జస్టిస్ బ్రిజేశ్ కుమార్ నేతృత్వంలో 2004లో ఏర్పాటైన ట్రిబ్యునల్-2.. 2013లో తుది తీర్పును ప్రకటించింది. ఆ తీర్పులోని పలు అంశాలను వ్యతిరేకిస్తూ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ట్రిబ్యునల్-2 తీర్పు అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. నాటి నుంచి అది పెండింగ్‌లో ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని, అవార్డును పాక్షికంగానైనా అమలు చేయాలని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు కేంద్రాన్ని కోరడంతోపాటు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ అవార్డు అంశాలపై చర్చించేందుకు జల్‌శక్తి శాఖ 18న అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నది.

## గ్రీన్ ఇండియా చాలెంజ్ చెట్టుకు పూజలు



మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలయ్యాయి. ఇవి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడానికే కాకుండా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకునేందుకు సైతం ఉపయోగపడుతున్నాయి. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో మొక్కలు నాటగా, అవి పెరిగి పెద్దవయ్యాయి. మంగళవారం వట సావిత్రి పౌర్ణమి సందర్భంగా మహిళలు ఆ వట వృక్షానికి పూజలు చేశారు. అప్పుడు నాటిన మొక్క ఇప్పుడు వృక్షంగా ఎదగడమేగాక పూజలు చేయడానికి ఉపయోగపడిందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు. - ఆదిలాబాద్

## కర్రె ముఖం దానా.. నీకు ఇల్లియ్యను పో!

- నువ్వేమైనా పైసలు ఇచ్చినవా?
- డబ్బు లిచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు
- మహిళను తిట్టి పంపిన కాంగ్రెస్ నాయకుడు వెంకన్న
- మహబూబాబాద్ జిల్లాలో మహిళకు ఘోర అవమానం



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విలపిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన శ్రీదేవి కుటుంబం

తొర్రూరు, జూన్ 10 : ఇందిరమ్మ ఇల్లు అడిగిన ఓ నిరుపేద మహిళకు ఘోర అవమానం ఎదురైంది. ఆడబిడ్డ అనే కనీస ఇంగితజ్ఞానం లేకుండా ఓ కాంగ్రెస్ నాయకుడు బలుపు మాటలు మాట్లాడాడు. అధికార దర్పాన్ని చూపించాడు. తానూ ఒక మనిషినేనన్న సోయి మరిచి ఆడబిడ్డపై నోరు పారేసుకున్నాడు. 'కర్రె ముఖం దానా.. నీకు ఇల్లు ఇయ్యను పో' అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడాడని సదరు మహిళ కన్నీటి పర్యంతమైంది. వివరాలు ఇలా.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన గుగ్గిళ్ల శ్రీదేవి, సుధాకర్ దంపతులు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. గుంటన్నర ఇల్లు జాగ తప్ప వీరికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. అదే జాగలో చుట్టూ పరదాలు, పైకప్పుగా ఇనుప రేకులు వేసుకుని 20 ఏండ్లుగా అందులోనే ఉంటున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని శ్రీదేవి మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోకాటి వెంకన్నను ఆయన ఇంటికి వెళ్లి కోరగా, తిట్టి పంపించాడని విలపించింది. 'మాకు ఇల్లు జాగ తప్ప గుంట వ్యవసాయ భూమి లేదు. 20 ఏండ్లుగా పరదాలతో కట్టుకున్న గుడిసెలో ఉంటున్నాం. పురుగు పుట్రకు భయపడుతూ బతుకుతున్నాం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి' అంటూ మంగళవారం ఉదయం వెంకన్న ఇంటికి వెళ్లి అడిగితే బూతులు తిట్టాడని శ్రీదేవి వాపోయింది. 'కర్రె ముఖం దానా.. నువ్వేమైనా డబ్బులు ఇచ్చావా? నీకు ఇల్లు ఎక్కడిది? నువ్వేమైనా నీళ్లు ఇచ్చావా? ఛాయ్ తాపిచ్చావా? పైసలు ఇచ్చావా? నేను బతికున్నంత కాలం నీకు ఇల్లు రానివ్వను' అంటూ నోటికొచ్చినట్టు తిట్టాడని ఆమె పేర్కొంది. ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో కాంగ్రెస్ నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇవ్వలేని పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీదేవికి గతంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరైందన్న సమాచారం ఉన్నదని, అయితే కొత్త లిస్టులో ఆమె పేరు లేదని గ్రామ కార్యదర్శి మౌనిక తెలిపారు. తాను ఇల్లు కట్టుకోలేదని, తనకు ఎలాంటి సమాచారం లేకుండానే తన పేరుతో ఎవరో నాయకులు బిల్లులు తీసుకొని మోసం చేశారని బాధితురాలు వాపోయింది. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధిత మహిళకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోండి

**శాస్త్రవేత్త దామోదర్ సూచన**

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్), జూన్ 10: రాష్ట్రంలో వరి సాగుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ వర్సిటీ వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ దామోదర్‌రాజు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి వరి రైతులు అధిక దిగుబడుల కోసం నాణ్యమైన దొడ్డు, సన్న, అతిసన్న రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎంటీ 1010కు ప్రత్యామ్నాయంగా కేఎన్ఎం 118, ఆర్ఎన్ఆర్ 29325, ఆర్ఎన్ఆర్ 28361, డబ్ల్యూజీఎల్ 1355, డబ్ల్యూజీఎల్ 915, జేజీఎల్ 28639, బీపీటీ సన్న రకాలకు బదులుగా ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, 44 సిద్ధి, డబ్ల్యూజీఎల్ 962, ఆర్‌డీఆర్ 1200, ఆర్ఎన్ఆర్ 21278, జేజీఎల్ 28545, కేబీఎస్ 6251, కేబీఎస్ 2874, డబ్ల్యూజీఎల్ 1246, జేజీఎల్ 33124, హెచ్ఎంటీ సోనా జైశ్రీరామ్‌కు ప్రత్యామ్నాయంగా 15048 కేఎన్ఎం 733, ఆర్‌డీఆర్ 1162 27356 ఆర్ఎన్ఆర్ 31479 రకాలను వర్సిటీ ఎంపిక చేసినట్టు వివరించారు. ఈ విత్తనాలు రాజేంద్రనగర్‌లోని ప్రధాన వ్యవసాయ కేంద్రంతోపాటు ఉప కేంద్రాల్లోనూ అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.

## 6.6 లక్షల దరఖాస్తుల తిరస్కరణ

మొదటిపేజీ తరువాయి...

దరఖాస్తులు స్వీకరించిన సర్కారు ఇప్పుడు ఆరు లక్షలపై చిలుకు దరఖాస్తులను తిరస్కరించి నిరుద్యోగుల ఆశలపై మరోసారి నీళ్లు చల్లింది. ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే, అందులో 15.53 లక్షల దరఖాస్తులు వెరిఫై అయ్యాయి. అయితే, వీటిలో 6.6 లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురికావడం, పథకం అమలుపై ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నది. ఈ పథకంలో భాగంగా రూ. 50 వేల యూనిట్‌కు 100 శాతం, రూ. లక్ష యూనిట్‌కు 90 శాతం, రూ. 2 లక్షల యూనిట్‌కు 80 శాతం, రూ. 4 లక్షల యూనిట్‌కు 70 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడతలో క్యాటగిరి-1లో రూ. 50 వేలు, క్యాటగిరి-2లో రూ. లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 9 నాటికి మంజూరు పత్రాలు పంపిణీ చేసి 15 లోగా



శిక్షణ ఇచ్చి నెలాఖరులో గ్రౌండింగ్ చేయాలని భావించింది. అయితే ఇప్పుడా ఆలోచనను ప్రభుత్వం విరమించుకున్నది.

### 6,60,332 దరఖాస్తుల తిరస్కరణ

రాజీవ్ యువ వికాసానికి వివిధ కార్పొరేషన్లవారీగా 16,23,643 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇప్పటివరకు 15,53,551 దరఖాస్తులను సంబంధిత అధికారయంత్రాగం పరిశీలించి వాటిలో 13,83,950 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. అంటే ఇక్కడ 1,69,601 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు, బ్యాంకర్లు సిబిల్ స్కోరు, లావాదేవీల ఆధారంగా మరికొన్ని పేర్లను తొలగించి 8,93,219 మందిని మాత్రమే ఎంపిక చేస్తూ ప్రభుత్వానికి జాబితా పంపారు. అంటే మొత్తంగా రెండు విడతల్లో 4,90,731 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తంగా చూసుకుంటే మాత్రం 6,60,332 దరఖాస్తులు రిజెక్టయ్యాయి. అంటే, దరఖాస్తుదారుల్లో 45 శాతం మందిపై ప్రభుత్వం నీళ్లు చల్లినట్టు అయింది. విషయం బయటకు వస్తే యువత నుంచి వ్యతిరేకత వస్తుందన్న భయంతోనే ఈ పథకాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఈ పథకాన్ని అమలు చేయాలని తొలుత అనుకున్నా, ఇప్పుడు ఎన్నికలు అయ్యాక మాత్రమే అమలు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తున్నది.

## ఇందిరమ్మ ఇల్లు అడిగితే.. సీఎంకు చెప్పుకోమంటారా?

- మరి మీరున్నది ఎందుకు?
- ఎంపీడీవోను నిలదీసిన దళిత వితంతు మహిళ



ఇందిరమ్మ ఇల్లు ఎందుకు రాలేదని కౌటాల ఎంపీడీవోను నిలదీస్తున్న మహిళ

కౌటాల, జూన్ 10: 'ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో, సర్వేలో నా పేరు ఉన్నది. కానీ ఇల్లు మంజూరు కాలేదు. ఇదేమని అడిగితే కలెక్టర్‌ను అడుక్కో. సీఎంకు చెప్పుకోమంటరా? మరి మీరున్నది ఎందుకు?' అంటూ ఓ దళిత వితంతు మహిళ ఎంపీడీవోను నిలదీసింది. ఈ ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగింది. తలోడి గ్రామానికి చెందిన అరికెల పద్మ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, సర్వే చేసిన అధికారులు జాబితాలో ఆమె పేరును చేర్చారు. కానీ, అర్హుల లిస్టులో ఆమె పేరు రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఆరా తీశారు. తను దళిత వితంతు మహిళనని, తనతో పాటు తన వదినలు అరికిల్ల మాధవి, అరికిల్ల రాజేశ్వరి.. నలుగురు పిల్లలు కలిసి తడికెలతో వేసుకున్న పాకలో ఉంటున్నామని వివరించారు. భవంతులు ఉన్న వారికి ఇండ్లు మంజూరయ్యాయి కానీ, గుడిసెలో ఉంటున్న తనకు ఎందుకు మంజూరు కాలేదని ఎంపీడీవో రమేశ్ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కలెక్టర్ నుంచి వచ్చిన లిస్టులో మీ పేరు లేదని, ఏంకావాలన్న కలెక్టర్‌ను అడుక్కోండని, లేదా ఇల్లు రాలేదని సీఎంకు పోయి చెప్పుకోండని దురుసుగా మాట్లాడారని ఆమె ఆరోపించారు.

